# అలోపలి మనిషి

"ఏంటి ఇది? కాఫీయా - కషాయమా?" ఆవేశంతో ఊగిపోతూ అరిచాడు సుబ్బారావ్.


గజగజలాడుతూ నిలబడిపోయిందతని భార్య గజలక్ష్మి.

ఆ దృశ్యాన్ని ఎంతో అడ్మైరింగ్‌గా చూశాడు ఫైళ్ళు పట్టుకొని అక్కడే నిలబడి ఉన్న రామారావ్.

అతనెందరో ఆఫీసర్స్‌ని చూశాడు. అందులో చాలామంది "జోరూకా గులామ్"లే. అందుకే అదే కేటగిరీకి చెందిన తను మున్ముందు కాబోయే "ఆఫీసర్"ననుకొంటూ - భార్యతో వేగుతూ వస్తున్నాడు.

కానీ అప్పుడప్పుడూ ఇలా భర్తలు విరుచుకుపడటం, భార్యలు భయపడటమూ చూస్తూంటే మాత్రం అతన్లోని "మగ అహంకారపు రక్తం" ఆనందంతో పరవళ్ళు తొక్కుతూ ఉంటుందా కాస్సేపు.

"ఏంటా నిలబడటం? వచ్చిన పనేదో చెప్పేడువ్" అన్న సుబ్బారావ్ హూంకరింపుకి ఈ



వాలి హిరణ్మయీదేవి

లోకంలోకి వచ్చాడతను. మెల్లిగా తను వచ్చిన పని ముగించుకుని – ఎదురుపడ్డ ఆఫీసర్ భార్యవైపు సానుభూతిగా చూస్తూ బైటపడ్డాడు రామారావ్.

ఇలాంటి సన్నివేశాలనా ఇంట్లో చూడటం అతనికలవాటే.

★ ★ ★

"అమ్మా, అమ్మా... నాకు మంచి జీన్స్ కావాలమ్మా – మా కాలేజీలో అందరూ అవే వేస్తున్నారు. నువ్వెలాగైనా నాన్నకి చెప్పమ్మా" అంటూ వేధిస్తున్నాడు రాజు.

"అమ్మో! ఆయనెదురుపడి నేను చెప్పటమే – నాతాట వలుస్తారు" అంది గుండెల మీద చేయేసుకొంటూ గజలక్ష్మి.

"మరెలా? నేనే అడుగుదామంటే ఆయనెప్పుడూ దుర్వాసుని అవతారంలోనే ఉంటారాయె. అవునమ్మా – రాత్రిపూట అమ్మలు అడిగినవేవీ నాన్నలు కాదనరని మా ఫ్రెండ్ చెప్పాడు. పోనీ రాత్రే అడగరాదా అమ్మా" అన్నాడు రాజు ఎంతో ఆలోచించి.

ఆ మాట విని బిక్కచచ్చిపోయింది గజలక్ష్మి. ఈ మనిషి ఆ టైమ్‌లోనూ అంతేగా? తనిష్టప్రకారం తనపని చేసుకుని అటు తిరిగి పడుకొనే భర్తతో తనేం చెప్పగలదని?


గజలక్ష్మి మనసు గతంలోకి పరుగులు తీసింది.

"ఒసేవ్ లక్ష్మీ, మీ మామగారిప్పటికీ మీ అత్తగారి కొంగుచాటు మనిషేనట. మీ ఆయనకీ అదే పోలికొస్తే నువ్వాడింది ఆట – పాడింది పాట" అంటూ మేనత్త మేలమాడితే – ఎంతో మురిసిపోయింది తన పెళ్ళిలో. కానీ ఏమైందింది? తల్లి గయ్యాళితనం – తండ్రి నంగిరితనంతో సుబ్బారావ్‌లోని కొత్త మనిషి నిద్రలేచాడు. "పెళ్ళాన్ని అణిచిఉంచినవాడే అసలైన మొగాడన్నది ఒంటబట్టించుకొని దాన్ని తూచా తప్పక పాటించడంతో తను ఇలా భర్త బాధితురాలయిపోయింది. కనీసం పిల్లలు పుట్టాక మారకపోతాడా అనుకొంటే – మరింత చండశాసనుడే అయిపోయాడు. భార్య కాబట్టి తను భరించకతప్పదు – కానీ తన కడుపున పుట్టిన నేరానికి పిల్లలూ భరించవలసి రావడం ఆమె మాతృహృదయాన్ని అతలాకుతలం చేస్తోంది.

ఏ విషయం చెప్పాలన్నా ఆదివారం తొమ్మిది నుంచి పది గంటల వరకూ జరిగే మీటింగ్‌లోనే చెప్పాలన్న ఆర్డర్ – ఈ మధ్యలో ఏం జరిగినా ప్రళయం వచ్చినా, ఆదివారమే 'సుబ్బారావుతో' మాట్లాడాలి. ఇంటికి గాని, ఇంట్లో వాళ్ళకి గానీ ఏది కావాలన్నా ఓ అర్జీ ఆదివారమే ఇవ్వాలి. అందులో రాసినవన్నీ శాంక్షన్ అవుతాయన్న నమ్మకం లేదు. ఫైనల్‌గా డిసైడ్ చేసేది సుబ్బారావనే చండామార్కుల వారే.

"ఎన్నాళ్ళో ఇలా – నారాత మార్చు" అంటూ దేవుళ్ళకి కొబ్బరి కాయకొడతానని మొక్కకుండా పూజలు చేస్తోంది తను. అతని కిష్టమైన పండుగ రోజున కొట్టడానికి మాత్రమే కొబ్బరి కాయలను తెచ్చే భర్త వల్ల ఏదన్నా జరిగితే ఓ నాలుగు కొబ్బరికాయలు కొడతానంటూ మొక్కుకోలేని అశక్తురాలు కాబట్టి.

ఇక ఏ పండక్కో, ఫంక్షన్‌కో – పుట్టింటికో, చుట్టాల ఇంటికో వెళ్ళాలంటే నానా చావుగా ఉంటుంది తనకి. 'రిక్షాకింత, టికెట్‌కింత' అంటూ లెక్కపెట్టి ఇస్తాడు. ఆఖరికి దాహం వేస్తే 'సోడా' కొనుక్కొని తాగేందుకూ ఉండవు. అందుకే ఎవరు ఎక్కడికి రమ్మన్నా "మావారు, పిల్లలూ నన్ను విడిచి ఉండలేరన్న" అందమ




యిన అబద్ధపు ముసుగు వేసి ప్రయాణాలని తప్పించుకోవడం మొదలుపెట్టింది.

ఇక సినిమాలూ - షికార్లూ అంటే ఆమడ దూరమే. మా ఫ్రెండ్స్ వాళ్ళ పేరెంట్స్‌తో కలిసి అక్కడికి వెళ్ళారు, ఇక్కడికి వెళ్ళారు మన మెందుకు వెళ్ళం?" అంటూ అడిగే పిల్లలకు "అలా బైట తిరిగితే మీ ఆరోగ్యాలు పాడవుతా యని మీనాన్న భయమమ్మా" అంటూ నచ్చ జెప్పడం అలవాటు చేసుకొంది. ఎన్నాళ్ళిలా? ఎదురుతిరిగితేనో? అన్న ఆలోచన వచ్చినా తను చదివిన వానాకాలం చదువుకి ఈ రోజుల్లో ఉద్యోగమేదీ రాదని, పిల్లలనెలా పోషించుకొనేదని - ఆ ఆలోచనని తీసిపారేస్తోంది. చిన్నప్పుడు ఎలాగోలా విన్నా - ఊహ వస్తున్న కొద్దీ పిల్లలడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడం కష్టమవుతోంది. అలాంటప్పుడే బాధ మెలి పెట్టేస్తూ ఇలా గతాన్ని తలచి వగచేలా చేస్తోం దామెని.

డోర్‌బెల్ చప్పుడవడంతో ఈ లోకంలోకి వచ్చింది గజలక్ష్మి.

★ ★ ★

"అమ్మా... పండక్కి ఇండెంట్ పెట్టమంటా రుగా - నా జీన్స్ గురించి రాసి రెడ్‌పెన్‌తో టిక్ పెట్టమ్మా" అంటూ మరోసారి గుర్తు చేసాడు రాజు.

ఆ రెడ్‌పెన్ మార్క్ 'అర్జంట్' అన్నవాటికి మాత్రమే వాడాలని సుబ్బారావు పెట్టిన కండిషన్.

"సరే చూద్దాంలేరా" అంది నీరసంగా గజలక్ష్మి ఏదైనా ఇంటికి తెమ్మంటే భర్త చేసే 'హంగామా' గుర్తొచ్చి. అంతలోనే మరుసటి రోజు టిఫిన్‌కి ఇడ్లీలు చేయమని భర్త చెప్పిన మాట గుర్తుకు వచ్చి - రుబ్బురోలు దగ్గరికి వెళ్ళింది నానిన మినపప్పు తీసుకొని. రుబ్బితేనే ఇడ్లీలు మృదువుగా వస్తాయని సుబ్బారావ్ నమ్మకం.

అందుకే మిక్సీ ఉన్నా రుబ్బురోలు పాత్రం పట్టుకోకతప్పదు గజలక్ష్మికి. ఆరోజు నీరసంగా ఉన్నా పని తప్పకపోయేసరికి కళ్ళ నీళ్ళ పర్యంతమవుతూనే పనులన్నీ చేసుకోసాగింది. మామూలప్పుడు ఎలా ఉన్నా వొంట్లో బాగోనప్పుడు భర్త చిన్నపాటి సాయాలు చేయాలని కోరుకుంటుందామె మనసు. కానీ అటు పుల్ల తీసి ఇటు పెడితే 'మగాడిగా' తన పరువు పోతుందనుకొనే సుబ్బారావు వల్ల ఆ కోరిక నెరవేరదు. అన్యోన్యంగా కలిసి మెలిసి పనులు చేసుకొనే భార్యాభర్తల వంక చూస్తూ "హూ... ఏదైనా రాసి పెట్టి ఉండాలి" అని నిట్టూరుస్తుంది.

★ ★ ★

రోజులు చకచకా గడుస్తున్నాయ్.

అలవాటుగా ఎప్పటిలాగే ఫైళ్ళు తీసుకొని వచ్చాడు రామారావ్. హాలులో తన ఆఫీసర్ సుబ్బారావ్ కన్పించకపోయేసరికి బెడ్‌రూమ్ లోకి తొంగి చూశాడతను. కళ్ళకు కన్పిస్తున్న దృశ్యం చూసి 'నిజమా-కలా?' అని తనని తాను గట్టిగా గిల్లుకొని, కళ్ళు విప్పార్చి మరీ చూశాడు రామారావు.

గజలక్ష్మి సోఫాలో హాయిగా కూర్చుని ఉంటే - ఆమె ఎదురుగా నిలబడి ఎంతో వినయంగా కాఫీ కప్ అందిస్తున్నాడు సుబ్బారావ్.

"ఏంటి కాఫీ ఇలా తగలడింది? కాస్త ఒళ్ళు దగ్గరుంచుకొని పనులు చేస్తూండు - వంట గూడా ఇలా తగలెట్టకు" అంటూ అరుస్తోంది గజలక్ష్మి.

"అలాగే లక్ష్మి - జాగ్రత్తగా చేస్తానుగా - ఏం వండమంటావో చెప్పు" అంటూ తలెత్తి చూసిన సుబ్బారావ్, రామారావ్‌ని చూసి తత్తరపడుతూ, లేని గాంభీర్యాన్ని తెచ్చుకొని "ఏంటోయ్ అలా చెప్పాపెట్టకుండా వచ్చావేంటి? హాలులో కూర్చోవచ్చుగా" అంటూ ఫైళ్ళలోని లెటర్స్‌ని ఆసాంతం చదవకుండా చకచకా సంతకాలు చేసి, ఫైల్‌నందిస్తూ "పాపం మీ అమ్మగారి వంట్లో బాగోకపోతేనూ - భర్తగా పట్టించుకోక తప్పదుగా" అన్నాడెటో చూస్తూ.

"మరేనండి" అంటూ తిరుగుమొహం పట్టాడు రామారావ్. మనసులో మాత్రం "దాల్‌మే కుఛ్ కాలాహై" అనుకొన్నాడు.

ఇంతకీ టైగర్‌లాంటి సుబ్బారావ్ 'జోరూకా - గులాం'లా మారిన వైనమెట్టిదనిన...

"ఛ... వెధవసంత. మా పై ఆఫీసర్ ఇంట్లో ఏదో ఫంక్షనుందట - ఫామిలీతో రమ్మనమని ఆర్డరేశాడు - వెళ్ళకతప్పదు. ఇదుగో గజం - ఆ ఎర్ర పట్టుచీర కట్టుకొని కాస్త స్టైల్‌గా తయారయి చావు - నాల్గింటికల్లా వస్తాను అంటూ పొద్దుటే చెప్పి వెళ్ళాడారోజు సుబ్బారావ్. భర్తతో బైటకు అప్పుడప్పుడూ మాత్రమే బైటకు వెళ్ళే గజలక్ష్మికి 'దడ' మొదలైంది. 'నువ్విలా కుర్చున్నావ్' 'అలా నడిచావ్' అంటూ అడుగడుక్కీ విమర్శించే భర్తతో వెడితే ఊపిరి పీల్చి - వదలడం కూడా భయంగా చేయాల్సి వస్తుంది. లేట్ చేస్తే 'శిరాలు' తొక్కుతాడను కొంటూ మూడున్నరకల్లా తయారయి కూర్చుంది గజలక్ష్మి.

దారంతా సణుగుతూ, గొణుగుతూ ఎలాగైతేనేం తన సీనియర్ ఆఫీసర్ ఇంటిముందు స్కూటర్‌ని ఆపాడు సుబ్బారావ్.

"ఇదుగో - హాలులో ఆ మూలగా కూర్చొని ఏడు. ఎవరితో ఏమీ కల్పించుకొని మాట్లాడకు. తప్పదన్నప్పుడు క్లుప్తంగా జవాబిచ్చి చావు" అంటూ ఆమెనో కార్నర్ ప్లేస్‌లోని కుర్చీలో

కూర్చోబెట్టి, అసహనంగా తచ్చాడసాగాడు సుబ్బారావ్.

అదే అతని కొంప ముంచింది.

తన వాళ్ళతో బాగా హస్కుకొట్టొచ్చని అక్కడే అతని ఆఫీసర్ భార్య కూర్చొని ఉండటం అతను గమనించకపోవడమే అతని రాతని తల్లక్రిందులు చేసింది. ఐదు నిమిషాలు గడిచాయో లేదో "అరె – అక్కడున్నది సుబ్బారావ్ గదూ" అంటూ దగ్గరికొచ్చి "హౌ ఆర్యూ సుబ్బూ" అంటు పలకరించి "ఏదీ నీ వైఫ్ – పరిచయం చేయలేదేంటి" అంటూ అడిగింది.

పై ప్రాణాలు పైనే పోతున్నట్లనిపించినా, గుండెలు చిక్కబట్టుకొని, లక్ష్మిని పరిచయం చేశాడతను.

"మీ వారు చాలా మంచివాడమ్మా – అంతకు మించి మంచి పనిమంతుడు. మావారితో ప్రమోషన్ ఇప్పించుకొనే ప్రయత్నాల్లో మా ఇంటికి తరచూ వచ్చేవాడులే. ప్రమోషన్ కోసం పాపం నేను ఏ పనిచెప్పినా చిటికెలో చేసి పెట్టేవాడు. బట్టలు ఎంత తళతళ మెరిసేలా ఉతికేవాడో తెలుసా – నా పెట్టికోట్స్ నుంచి మావారి, పిల్లల అండర్‌వేర్స్ వరకూ మిలమిలా మెరిసిపోయేవి – అందరూ ఏం వాడతారూ అనడిగితే మా సుబ్బూని – అనే దాన్ని మురిపెంగా. ఇక అంట్లు తోమితే అవి కొత్త సామాన్లా తళతళలాడేవనుకో. మా పిల్లల స్కూల్ ఫీజులేంటి – మా ఇంటి కరెంట్ బిల్లేంటి, మరొకటి ఏంటి – అన్నీ తనే గుర్తుగా నెలనెలా కట్టేవాడు. బజార్నుండి వెచ్చాలన్నీ ఆఖరికి నా సానిటరీ సామానుతో సహా అన్నీ తెచ్చేవాడు. అంతేనా? పాపం మంచాన పడి ఉన్న మా మామగారికైతే కుడి–ఎడమ చెయ్యనక సేవలు చేశాడు. ఆయన యూరిన్, ఆఖరికి స్టూల్ స్పెసిమన్‌లు గూడా డాక్టర్ దగ్గరికి ఏ మాత్రం అసహ్యించుకోకుండా తీసుకెళ్ళేవాడు – అతనికి ప్రమోషన్ వచ్చి వెళ్ళాక మేము చాలా సఫర్ అయ్యాం. నిజం సుబ్బూ – వుయ్ అర్ మిస్డ్ యూ ఎలాట్" అంటూ ఆమె చెప్పుకుపోతూ ఉంటే 'సుబ్బారావ్ గొంతులో వెలక్కాయ పడ్డట్లు 'మరే–అలాగా' అంటూ చేతులు నులుముకోసాగాడు. వింటోన్న గజలక్ష్మికి ఎక్కడ్లేని ఆశ్చర్యాగ్రహాలు సమపాళ్ళలో కల్గాయ్.

అంతే... ఇంటికొచ్చాక పరిస్థితి మారిపోయింది. సుబ్బారావులోని లోపలి మనిషి గురించి తెలుసుకొన్న గజలక్ష్మి అనే పిల్లి 'పులి' గా మారింది.

★ ★ ★

ఆ రోజు సుబ్బారావ్ ఆఫీస్‌లో అడుగు పెట్టేసరికి రామారావ్ తన కొలీగ్స్‌తో హస్కు కొడుతున్నాడు. సుబ్బారావ్‌ని చూసి కూడా ఏమాత్రం జంకక, తను చెబుతున్న జోక్స్‌ని కంటిన్యూ చేయసాగాడు – అవన్నీ సుబ్బారావ్ చెవిన పడేలా.

'ఓసారి కొన్ని సింహాలు ఓ మీటింగ్ నేర్పాటు చేసుకొన్నాయ్. అందులో సింహాలు తప్ప మరే జీవీ అటెండ్ కారాదని చాటింపు వేశాయి. మీటింగ్ మొదలై – ముగియబోతూ ఉండగా – ఓ చిట్టెలుక ఆ మీటింగ్‌లో కూర్చొని ఉండటం గమనించి ఓ సింహం "ఏం మా చాటింపు వినలేదా? ఇక్కడ సింహాలకు తప్ప చిట్టెలుకలకు స్థానం లేదని తెలీదా" అంటూ గర్జించింది. అందుకా చిట్టెలుక "పెళ్ళికి ముందు నేనూ సింహాన్నే" అందిట అంటూ ఆపాడు రామారావ్. ఆ జోక్‌కి అందరూ పగలబడి నవ్వుతూంటే, సుబ్బారావ్ మాత్రం పళ్ళు నూరుకొన్నాడు. ●